ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బజార్‌హత్నూర్: మండలంలోని బోస్ర గ్రామ హనుమాన్, శివ ఆలయాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయాలకు విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. శివ చరిత్రను గ్రామస్తులకు తెలియజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పలు సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొంటకే నందీశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
మంగళవారం 11 ఏప్రిల్ 2023

14న మెగా ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న అంబేద్కర్ మెమోరియల్ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. మండలంలోని చింతగూడ కోయవాగు అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జన్, స్త్రీ వైద్య నిపుణులు, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, రక్తపరీక్షలు కూడా ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9177989953 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పేస్కేల్‌కు మోక్షమెప్పుడో..?

- ఏండ్లుగా ఎదురుచూస్తున్న వీఆర్‌ఏలు
- ప్రభుత్వం హామీనిచ్చినా అమల్లో కాలయాపన
- త్వరగా పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి

పల్లెల అభివృద్ధికి అహర్నిషలు కృషిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ)ల పేస్కేల్‌కు మోక్షం లభించడం లేదు. గ్రామాల్లో ఏండ్లుగా వెట్టిచాకిరీ చేస్తూ గౌరవ వేతనంతో బతుకీడుస్తున్న వీఆర్‌ఏలు తమకు మూల వేతనం అమలు చేయాలని కోరుతున్నారు. వీరి కోరిక ప్రకారమే ప్రభుత్వం 2017లోనే పేస్కేల్ అమలు చేస్తామని ప్రకటించినా అతీగతి లేకుండా పోయింది. ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 90రోజులు పాటు నిరవధిక సమ్మె చేపట్టినా ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత సమస్యను పరిష్కరిస్తామని మరోసారి చెప్పిన ప్రభుత్వం ఈ ఎన్నిక ముగిసి మూడు నెలలు గడుస్తున్నా ఎలాంటి పురోగతి కనిపించడం లేదని వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి తీపి కబురు అందుతుందని భరోసాతో బతుకుతున్న వీరికి నెలలు గడుస్తున్నా నిరాశే ఎదురవుతోంది. మరో వారం రోజుల పాటు వేచిచూసి మరోసారి పోరాట మార్గాన్ని ఎంచుకోవాలని భావిస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పల్లెల్లో రెవెన్యూ పరమైన సమస్యలు, అధికారిక కార్యక్రమాలు, వివిధ పత్రాల జారీలో కీలకంగా వ్యవహరించే వీఆర్‌ఏల పట్ల ప్రభుత్వం కఠిన వైఖరి అవలంభిస్తోంది. అనేక ఏండ్ల పాటు ప్రభుత్వం అందించే గౌరవ వేతనంతో జీవనం సాగిస్తున్న వీరు తాజాగా కొన్నేండ్ల నుంచి మూల వేతనం కోసం పోరాడుతున్నారు. ప్రభుత్వం పలుమార్లు వీరికి మూలవేతనం అందజేస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చడం లేదు. వీఆర్‌ఓలను మాత్రం ఇప్పటికే వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. మునుగోడు ఎన్నికల కంటే ముందు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90రోజుల పాటు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టారు. మూల వేతనంతో పాటు పదోన్నతులు కల్పించాలని, వయసు పైబడి వీఆర్‌ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మె కారణంగా తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు వచ్చాయి. స్పందించిన ప్రభుత్వం మునుగోడు ఎన్నికల తర్వాత సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చింది. దీంతో వీఆర్‌ఏలు సమ్మెను విరమించి విధుల్లో చేరారు.

సర్కారు కరుణ కోసం..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 2500మంది వీఆర్‌ఏలు ఉంటారు. ప్రస్తుతం భూ సంబంధిత సమస్యలు తప్పితే గ్రామానికి అవసరమైన అన్ని పనులు వీరే చేపట్టాల్సి ఉంటుంది. అన్ని పనులు చేపడుతున్నా ప్రభుత్వం తమకు గౌరవ వేతనం రూపంలో కేవలం రూ.11,400అందజేస్తోంది. ఈ డబ్బులు కుటుంబ పోషణకు ఎటూ సరిపోవడం లేదు. అన్ని రకాల వస్తువులు, సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న వేతనంతో కుటుంబాలను నెట్టుకురావడం వారికి కష్టంగా మారుతోంది. దీంతో అనేక ఏండ్ల నుంచి తమకు మూల వేతనం అందజేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పేస్కేల్ వర్తింపజేస్తామని పలుమార్లు హామీలిచ్చినా అమల్లో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం విధించిన గడువు కూడా ముగిసిపోవడంతో తమ సమస్యలకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఎదురుచూస్తున్నారు. కొన్ని రోజులు వరకు వేచిచూసి మళ్లీ ప్రత్యక్ష పోరాటానికి దిగాలని ఆ సంఘం నాయకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలి : ఇందూరు గంగన్న, వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు

మా సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం కొన్నేండ్ల క్రితమే హామీనిచ్చింది. మునుగోడు ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తోంది. కానీ సమస్య పరిష్కారంపై దృష్టిసారించడం లేదు. పేస్కేల్, పదోన్నతులు, వారసులకు ఉద్యోగాలతో పాటు సమ్మెకాలపు వేతనం కూడా అందజేయాలి. ప్రభుత్వం మా సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతున్నాం.



బొట్టు పెడుతూ ఆహ్వానం

నవతెలంగాణ-కోటపల్లి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో చెన్నూర్‌లో నేడు నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి కిష్టంపేట, కొమ్మెర, చాకేపల్లి, అశ్వద్, నాగపూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు గడప గడపకు తిరుగుతూ బొట్టు పెడుతూ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతే తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంఐఎం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎంఐఎం ఆధ్వర్యంలో సోమవారం కాగజ్‌నగర్‌లోని ముస్లిం మైనార్టీ ఫంక్షన్ హాలులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దీనికి జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో పాటు ఎంఐఎం హైద్రాబాద్ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ హాజరయ్యారు. ముందుగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ కల్యాణ్, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ సుభాన్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అర్షద్‌హుస్సేన్, ఎంఐఎం కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ముబీన్, ప్రధాన కార్యదర్శి జావీద్ పాల్గొన్నారు.

అమరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలి

- సీపీఐ(మావోయిస్టు) లేఖ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 20న ఇంద్రవెల్లిలో నిర్వహించే అమరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని కుమురం భీం-ఆసిఫాబాద్, మంచిర్యాల డివిజన్ కమిటీ కార్యదర్శి అడెల్లు అలియాస్ భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 42 ఏళ్ల క్రితం జల్, జంగిల్, జమీన్ కోసం పోలీసులకు, గిరిజనులకు మధ్య జరిగిన పోరాటంలో ఎంతో మంది గిరిజనులు నేలకొరిగారని, వారి సంస్మరణార్థం నిర్వహించే ఈ సభను విజయవంతం చేయడం ద్వారా అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు రైతుల వినతి



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని పోతపెల్లి గ్రామానికి చెందిన 26 మంది రైతులు తహసీల్దార్ సరితకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోతపెల్లి శివారులోని సర్వే నెం 190, 191 భూమిలో 40 ఏండ్ల నుండి పంట సాగు చేసుకుంటున్నామన్నారు. భూములకు సంబంధించిన పట్టాపాస్ పుస్తకాలు, రైతుబంధు, రైతుబీమా ద్వారా లబ్ధి పొందుతున్నామన్నారు. పైఅధికారులు తమను వ్యవసాయం చేసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అటవీ అధికారుల జోక్యం లేకుండా వ్యవసాయం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో రైతులు తొర్రెం లక్ష్మి, బానక్క, చిన్నక్క, పోశమల్లు, కిషన్, చంద్రయ్య, నాగయ్య, రాజ్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-బాసర

రైల్వేస్టేషన్ పరిధిలో సోమవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు. మృతుని వయస్సు 40 వరకు ఉంటుందని, బూడిద కలర్ రంగు చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అల్ఫాన్సా హైస్కూల్‌లో సోమవారం పదవ తరగతి పరీక్షలు రాసిని సుమారు 200మంది పిల్లలకు దుబ్బేటి సంతోష్ సహకారంతో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకులు సంతోష్, ఎర్రబెల్లి రాజేష్ మాట్లాడుతూ పరీక్ష రాసిన పిల్లలు ఎండలకు అలసటకు గురి కాకుండా, వడదెబ్బ తగలకుండా ఉండేందుకు మజ్జిగ ప్యాకెట్లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు కొక్కుల సతీష్, ఆర్నే సతీష్, సాంబార్ శేఖర్, బబ్లూ, సాయిరాం, మనీ, గౌస్, మెరాజ్, రాజుకుమర్, దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్యూస్ పంపిణీ



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పారంపెల్లి పోశన్న ఆధ్వర్యంలో జ్యూస్‌ను తహసీల్దార్ సరిత అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసింగ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి, జాగృతి మండల కన్వీనర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీధర్, యువకులు రాజు, ప్రవీన్ పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ కార్మికుల నిరాహార దీక్ష



నవతెలంగాణ-మంచిర్యాల

పాత మంచిర్యాల రంగంపేట వద్ద ఉన్న శాలివాహన పవర్ ప్లాంట్‌లో సోమవారం కార్మికుల నిరాహార దీక్ష చేపట్టారు. శాలివాహన గ్రీన్ ఎనర్జీ, బయోమాస్ పవర్ ప్లాంట్ 2022 డిసెంబర్ 6వ తేదీన పవర్ పర్చేస్ అగ్రిమెంట్ (పిపిఎ)ముగిసిపోవడంతో కంపెనీ యాజమాన్యం, కార్మికులతో ఎలాంటి చర్చలు జరపకుండా కంపెనీనీ మూసేసింది. అప్పటి నుండి కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలు, బోనస్ ఇతర అలవెన్స్‌లు చెల్లించాలని నాలుగు నెలలుగా కార్మికులు యాజమాన్యంతో మొరపెట్టుకుంటున్నారు. యాజమాన్యం నుండి స్పందన లేకపోవడంతో అసిస్టెంట్ లేబర్ కమిషనర్, జాయింట్ లేబర్ కమిషనర్ వరంగల్‌కు తమ డిమాండ్లపై వినతి పత్రాలు అందజేశారు. అయినప్పటికీ కార్మికులకు ఎలాంటి న్యాయం జరగకపోవడంతో కంపెనీ ఆవరణలో నిరాహార దీక్ష చేపట్టారు. యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలు. పరిష్కరించే వరకు నిరాహార దీక్ష కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు కుంటాల శంకర్, ప్రధాన కార్యదర్శి ఎన్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎస్ ఆనంద్‌రావు, కాయితి శ్రీనివాస్, కోశాధికారి డి మల్లయ్య, ఆసరి రాజయ్య, ఎస్ తిరుపతి, బుచ్చయ్య, సలహాదారులు ఎడ్ల శ్రీనివాస్, చెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండవ విడత గొర్రెల పంపిణీకి చర్యలు

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గొర్రెల పెంపకందారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డా. సురేష్ కుమార్‌తో కలిసి పశు వైద్యాధికారులతో 2వ విడత గొర్రెలకు పంపిణీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారుల వాటా ధనం చెల్లించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, లబ్ధిదారులు కుల ధృవీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న గొర్రెల పంపిణీ కార్యక్రమానికి అర్హులైన లబ్ధిదారులు తమ వాటా మొత్తం చెల్లించి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.రమేష్, వివిధ మండలాల పశు వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - కౌటాల

మండలంలోని నదిమాబాద్ గ్రామానికి చెందిన నస్పూరి పోశం(52) సోమవారం మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో గల చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీన్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం భార్యకు గుండె సంబంధిత వ్యాధి ఉండడం, ఆర్థిక సమస్యల కారణంగా మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డిమాండ్ల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావ్ అన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న నిర్వహించనున్న సమ్మె సన్నాహక సమావేశాన్ని సోమవారం పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి యాజమాన్యానికి పలుమార్లు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. నోటీసు ఇచ్చిన ప్రతిసారి చర్చలకు పిలిపించి ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా ముగిస్తున్నారని తెలిపారు. 17లోపు వేతన సవరణ, ఈపీఎఫ్ టూ జీపీఎఫ్, ఆర్టిజెన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే సమ్మె బాట పడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్ సదానందం, సుద్దాల శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, రమేష్, గౌతమ్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

పెంచికల్‌పేట్ : మండలంలోని ఎల్లూరు గ్రామంలో పల్లెపల్లెకు, ఇంటింటికి బీజేపీ వాల్‌పోస్టర్లను ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు బూరం శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు చపిడె సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9ఏండ్లుగా బీసీలను అన్ని రంగాల్లో అణచివేస్తున్నారని, రాష్ట్రంలో 54 శాతం ఉన్న బీసీలను చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఓట్ల కోసం తప్ప బీసీల అభివృద్ధికి పాటుపడడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుల్లం నారాయణ, ఓబీసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, బీజేపీ మండలాధ్యక్షుడు జునుగరి మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి కుకుడ రాజేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గణపురం నాగేష్ పాల్గొన్నారు.

పెరుగుతున్న కరోనా కేసులు

- రిమ్స్‌లో మాక్‌డ్రిల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైద్యశాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం రిమ్స్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, కోవిడ్ నోడల్ అధికారి క్రాంతికుమార్, వైద్యులు కోవిడ్ వార్డులో పర్యటించారు. అంతకుముందు రిమ్స్‌లో అందుతున్న చికిత్సల గురించి తెలుసుకున్నారు. బాధితులకు చికిత్సలు అందించడానికి అందుబాటులో ఉన్న సౌకర్యాలు, మందులు, ఆక్సిజన్, బెడ్స్, వెంటిలేటర్లను పరిశీలించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని డైరెక్టర్ సూచించారు. నెల రోజుల నుంచి కోవిడ్ కేసులు పెరుగుతున్నాయన్నారు. రిమ్స్‌లో బాధితులకు వైద్య సేవలను అందించడానికి 550 పడకలు గుర్తించామన్నారు. ఇందులో 50 ఐసోలేషన్ బెడ్, 500 ఆక్సిజన్ బెడ్స్, 100 వెంటిల్స్ బెడ్స్ ఏర్పాటు చేశామన్నారు. 154 వెంటిలేటర్స్‌తో పాటు ఆక్సిజన్ సరిపడా ఉందని తెలిపారు. కోవిడ్ లక్షణాలు కలిగిన వారు వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీ లేదా రిమ్స్‌లో పరీక్షలు చేయించుకోవాలని, పాజిటివ్ ఫలితాలు వస్తే చికిత్స పొందాలన్నారు. ప్రస్తుతం రిమ్స్‌లో ముగ్గురు చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ చందు, సీనియర్ వైద్యులు డాక్టర్ తిప్పే స్వామి పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బాపురావు



నవతెలంగాణ-తలమడుగు

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. సోమవారం మండలంలోని కుచులాపూర్ గ్రామంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని చూసి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. ఎవరెన్ని చెప్పినా బీఆర్ఎస్ వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. సమస్యలు ఏమైన ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్ మరోసారి గెలిచి అధికారంలోకి వస్తుందన్నారు. కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పార్టీ కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ప్రభ పండిత్, రాంబాయి, ఎంపీటీసీ చంటి, ఉప సర్పంచ్ కిసాన్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, రైతుబంధు నాయకుడు గోక జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్, మగ్గిడి ప్రకాష్, ఆశన్న యాదవ్, మీసాల మల్లయ్య, విలాస్, దేవరావు, డాక్టర్ రవీందర్, ప్రమోద్, రాంకిషన్, నర్సిములు, జనార్ధన్, పల్లవి, నారాయణ, సంతోష్, మహేష్, మల్లయ్య పాల్గొన్నారు.

నీటి ఇబ్బందులు పట్టించుకోని అధికారులు

- మంచి నీటి ట్యాంకర్లను ప్రారంభించిన కేఎస్ఆర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణ శివారు కాలనీలలో నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్న పాలక పక్షాలు, అధికారులు పట్టించుకోవడం లేదని కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కేఆర్కే కాలనీలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు మంచి నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయగా పూజలు చేసి ప్రారంభించారు. వేసవి ప్రారంభంలో పట్టణ శివారుతో పాటు పలు కాలనీల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. పాలకపక్షాలు, అధికారులు పట్టించుకోని కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తమ దృష్టికి ఈ విషయం రావడంతో ప్రస్తుతం రెండు ట్యాంకర్లను ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నామని, మరో 15 రోజుల్లో 4 ట్యాంకర్లను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. నీటి సమస్య ఉన్న ప్రతి కాలనీకి ట్యాంకర్లను అందిస్తామన్నారు. 14 ఏళ్ల పాలనలో ఎమ్మెల్యే జోగు రామన్న ప్రజల కోసం చేసిందేమీ లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గిమ్మ సంతోష్, ప్రశాంత్, దేవిదాస్, రాజ్‌కుమార్, సాయి పాల్గొన్నారు.

కంటి వెలుగుతో జీవితాల్లో వెలుగు



నవతెలంగాణ-మంచిర్యాల

కంటి వెలుగు ద్వారా జీవితాల్లో వెలుగులు నిండుతాయని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య అన్నారు. సోమవారం తాను ప్రాతినిధ్యం వహించే పాత మంచిర్యాల 8వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలలో కంటి వెలుగు ప్రత్యేకమైనదన్నారు. కంటి చూపు బాగుంటేనే ప్రతి ఒక్క పనిని అందరూ సజావుగా చేస్తారని, కంటి జబ్బుతో ఎవరూ బాధపడకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఎర్రం తిరుపతి, మాజీ కౌన్సిలర్లు బొలిశెట్టి కిషన్, పల్లె రాజన్న, వార్డు బీఆర్ఎస్ అధ్యక్షులు వేముల గురవయ్య, నాయకులు గొట్టేముక్కల శంకరయ్య శెట్టి శ్రీనివాస్, రమేష్ యాదవ్, ఆరె మల్లేష్, అమ్రోస్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలపై సమీక్ష

నవతెలంగాణ-నస్పూర్

ఏప్రిల్ 14న నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకలపై శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం ఎస్ఓ టు జీఎం అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి వేడుకలను జనరల్ మేనేజర్ కార్యాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించాలని, దానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను సంబంధిత విభాగాలు పూర్తి చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, డీజీఎం పర్సనల్ అరవింద రావు, సివిల్ ఇంజనీర్ శ్రీధర్, ఎస్టీ లైసెనింగ్ ఆఫీసర్ వీరన్న, ఎస్సీ లైజెనింగ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, సీనియర్ పిఓ పి కాంతారావు, శ్రీరాంపూర్ ఏరియా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ముధోల్



మండలంలోని విఠోలి గ్రామంలో నూతనంగా మంజూరైన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి దశల వారిగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, సర్పంచ్ సత్యయ్య గౌడ్, నాయకులు కిష్టయ్య, విజేష్ రాజేందర్‌రెడ్డి, గౌతం, నాగేష్ పటేల్, వంశీ, శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్మల్ డిపో మేనేజర్ ఎస్.సాయన్న ఆదేశాల మేరకు దివ్యాంగులకు ప్రయాణంలో 50శాతం రాయితీతో కూడిన బస్ పాసులు జారీ చేశారు. అర్హులైన దివ్యాంగులు సదరమ్ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, ఫొటో తీసుకు వచ్చి బస్‌పాస్ పొందవచ్చని ఆర్టీసీ ఉద్యోగి రమణ తెలిపారు. ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందన దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కారోబారి నర్సయ్య, దివ్యాంగులు శంకర్, రాజేందర్ ఆశన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం



నవతెలంగాణ-గుడిహత్నూర్

అక్రమంగా తరలిస్తున్న టేకు కలప వ్యానును సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇచ్చోడ సీఐ నైలూ నాయక్ తెలిపిన ప్రకారం... కలప అక్రమంగా తరలిస్తున్నట్టు వచ్చిన పక్కా సమాచారంతో సీఐ నైలూ నాయక్, ఎస్సై ప్రవీణ్ కుమార్ రెండు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టగా తెల్లవారుజామున మండల కేంద్రంలోని హిందుస్తాన్ ధాబా సమీపంలో అనుమాస్పదంగా నిలిపి ఉన్న వ్యాన్‌ను తనిఖీ చేస్తుండగా వ్యానుతో ఉన్న ఇద్దరు పరారయ్యారు. దీంతో వ్యానులో పరిశీలించగా 48 టేకు దుంగలు ఉన్నాయి. వ్యాన్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి, అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఎఫ్ఆర్వో పాండురంగ్, సెక్షన్ ఆఫీసర్ కృష్ణ నాయర్, ఎఫ్‌బీఓ నర్సయ్యలు వ్యాన్ స్వాధీనం చేసుకొని ఇచ్చోడ కలప డిపోకు తరలించారు. ఈ కలప విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. తనిఖీల్లో ఏఎస్సై బలిరాం, కానిస్టేబుళ్ల విఠల్, భూమన్న, సదాశివ్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికీ ఉపాధి హామీ చట్టం కింద పని కల్పించాలని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రాథోడ్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగామ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ ప్రదేశంలో తాగునీరు, టెంట్, ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ వి.రాంప్రసాద్, ఏపీఎం ఎం.నరేందర్‌గౌడ్, జిల్లా ప్లాంటెషన్ మేనేజర్ సూర్య ప్రకాష్, టీఏ సుజాత, క్షేత్ర సాహయకుడు నిమ్మల సుధాకర్ ఉన్నారు.

పదో తరగతి పరీక్షకు 60 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 54 పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 60 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 10, 652 విద్యార్థులకు గాను 10,592 విద్యార్థుల హాజరైనట్టు డీఈఓ ప్రణీత తెలిపారు.

ఆలస్యంగా వెలుగు చూసిన దొంగతనం

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని తరోడ గ్రామంలో ఓ ఇంట్లో జరిగిన దొంగతనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తరోడ గ్రామానికి చెందిన సిలారం గంగాధర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 4న ఇంటికి తాళం వేసి తీర్థయాత్రకు తిరుపతికి వెళ్లారు. అయితే ఇంటికి తాళం వేసి తాళం చెవిలను కిటికీ పక్కన పెట్టాడు. తీర్థయాత్రలు ముగించుకొని ఆదివారం అర్ధరాత్రి బాధిత కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకున్నారు. అయితే కొద్ది సమయం తర్వాత ఇంట్లో ఉన్న బీరువాను చూడగా బీరువా తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి పరిశీలించారు. అయితే బీరువాలో ఉన్న 29 గ్రాముల బంగారంతో పాటు, నగదు రూ.56 వేలు చోరీకి గురైనట్టు గుర్తించారు. చోరీకి పాల్పడిన వారు అనుమానం రాకుండా ఎప్పటి మాదిరి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. బాధిత కుటుంబం ఇంటి తాళం తీసి బీరువా చూసేవరకు చోరీ జరిగినట్లు తెలిసి రాలేదు. సోమవారం ఈ విషయాన్ని పోలీసులకు బాధితుడు తెలియజేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గుండెకు సంబంధించిన సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏజన్సీ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కుడ్మెత మనోహర్ అన్నారు. సోమవారం పిట్టబొంగరం, ఇంద్రవెల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలోని వైద్య సిబ్బందికి స్థానిక రైతు వేదిక భవనంలో మాస్టర్ ట్రైనర్ డా.ప్రతాప్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో అధికంగా పని ఒత్తిడి, సరి అయిన సమయంలో నిద్రలేక మానసిక డిప్రెషన్‌కు గురవుతున్నారని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా గుండె నొప్పితో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు జరుగడం బాధాకరమని అన్నారు. ఛాతీలో నొప్పి వచ్చి క్షణాల్లో ప్రాణాలు పోతున్నాయని అన్నారు. దాని నివారణకు కృత్రిమంగా సీపీఆర్ చేయడం వలన 90శాతం మనుషుల్లో ప్రాణాలు కాపాడగలుగుతామని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇక్కడనిచ్చిన శిక్షణను నేర్చుకొని తమ తమ గ్రామాల్లో ఈ సీపీఆర్ టెస్ట్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని వెల్లడించారు. గుండె సంబంధిత రోగికి సీపీఆర్ టెస్ట్ అందించిన వెంటనే దగ్గరలోని సర్కారు దవాఖానకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.విజయ్ కుమార్, డా.శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎఎన్ఎం సముద్ర పాల్గొన్నారు.

భూమిని కబ్జా చేస్తున్నారని
పురుగులమందు తాగిన రైతు

- పోలీసులే కారకులంటూ వాహనాన్ని అడ్డుకున్న కుటుంబ సభ్యులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

తమ భూమిని దౌర్జన్యంగా కబ్జా చేయడాన్ని తట్టుకోలేక మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన అయినవేణి పెద్ద నర్సయ్య సోమవారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయనను నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమ తండ్రి ఈ సంఘటనకు పాల్పడటానికి పోలీసులే ప్రధాన కారకులని ఆరోపిస్తూ రైతు పెద్ద నర్సయ్య కుమారులు, అయినవేణి నరేంద్, అయినవేణి నడ్పి నర్సయ్య, అయినవేణి నర్సయ్య, అయినవేణి నరేష్, వారి కుటుంబ సభ్యులంతా పోలీసు వాహనాన్ని అడ్డుకొని రోడ్డుపై బైటాయించారు. ఎస్సై ఓ రియల్టర్‌కు వంతపాడుతూ తమకు అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మస్కాపూర్ గ్రామ శివారులో అయినవేణి పెద్ద నర్సయ్యకు సర్వే నెంబర్ 341/అ లో 2 ఎకరాల 26 గుంటల భూమి ఉంది. అందులో నుంచి 2 ఎకరాల 4 గుంటలు ఓ రియల్టర్‌కు గతంలో అమ్మేశాం. మిగతా భూమికి హద్దులు వేసుకున్నాం. సదరు హద్దులు వేసిన భూమికూడా తనదేనంటూ రియల్టర్ మరి కొంతమంది కలిసి దౌర్జన్యంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దీనిని సహించని పెద్ద నర్సయ్య కుటుంబ సభ్యులు ఎదురు తిరిగి అడ్డుకున్నారు. ఈ సమస్య గత కొంత కాలంగా జరుగుతుంది. విషయం పోలీసుల వరకు వెళ్లడంతో పెద్ద నర్సయ్య కుటుంబ సభ్యులను ఎస్సై స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించనట్టు సదరు కుటుంబ సభ్యులు ఆరోపించారు. అధికారుల సూచన మేరకు భూమిని కొలత చేయడానికి ఎంసీని రప్పించినా కూడా పోలీసుల మద్దతుతో సదరు రియల్టర్, ఆయన అనుచరులతో కలిసి కొలతలు చేయకుండా అడ్డుతగిలినట్టు ఆరోపించారు. ఈ క్రమంలో ఎస్సై తీరును తప్పుబడుతూ గంట పాటు పోలీసు వాహనానికి అడ్డంగా కూర్చుని నిరసన తెలిపారు. వాహనాన్ని పోలీసులు వెనక్కు తీసుకొని వెళ్లిపోయారు.

మా నాన్నకు ఏం జరిగినా ఎస్సైదే బాధ్యత : కుటుంబ సభ్యులు

పోలీసుల వేదింపుల వల్లనే తమ తండ్రి పురుగులమందు తాగాడని ఆయన కుమారులు ఆరోపించారు. న్యాయం చేయాల్సిన పోలీసులే రియల్టర్‌లకు మద్దతునిస్తూ తమను తరచుగా స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించారని, ఇది తట్టుకోలేకనే తమ తండ్రి పురుగులమందు తాగాడని కుమారులు ఆరోపించారు.

గొడవ చేసుకోవద్దని సర్ది చెప్పాను : ఎస్సై శంకర్

గత కొంత కాలంగా సదరు భూమి కొన్నవారికి, పెద్ద నర్సయ్య కుటుంబ సభ్యులకు గొడవ జరుగుతోంది. ఇరు వర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశాను తప్పితే ఎవరినీ హెచ్చరించలేదు. ఇరువర్గాలు కూర్చుండి సమస్యను పరిష్కరించుకోవాలి.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీడీ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ఆధ్వర్యంలో బీడీ కార్మికులు కదం తొక్కారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్మికులు సోమవారం జిల్లా కేంద్రంలోని తనిషా గార్డెన్‌లో సమావేశమయ్యారు. అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాసేపు తోపులాట జరుగగా లోపలికి దూసుకెళ్లారు. జిల్లా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుహాసినిరెడ్డి మాట్లాడుతూ బీడీ కార్మికుల సమస్యలు తీర్చాలని ఎన్ని సార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని అన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు కష్టపడి వెయ్యి బీడీలు చుడితే కేవలం 200 వందల రూపాయలు వస్తున్నాయని, వాటిని అయిదు వందల రూపాయల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా బీడీ పరిశ్రమపై ఆధారపడి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.15లక్షల మంది ఆధారపడి ఉన్నారని అన్నారు. సమైక్య రాష్ట్రంలో బీడీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆనాడు ఉద్యమ నాయకుడిగా ఉన్న సీఎం కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నా వారి ఇబ్బందులు తీరలేదని, పీఎఫ్ ఉన్న ప్రతి కార్మికులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



నవతెలంగాణ-ముధోల్

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ముధోల్‌లోని డీలక్స్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ప్రతి ఇంటికి ఒక సంక్షేమ పథకం అందిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అనేక రంగాల్లో సీఎం కేసీఆర్ అభివృద్ధి చేశారని అన్నారు. బీఆర్ఎస్ అందరిని సమానంగా చూస్తోందని అన్నారు. ప్రతిపక్షాలు కావాలని రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. రానున్న ఆరు నెలల కాలంలో ముధోల్ నియోజక వర్గం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్, పీఏసీఎస్ చైర్మెన్ తీగల వెంకటేష్ గౌడ్, మండల రైతుబంధు అధ్యక్షులు రామిరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ సాయిరాం, నాయకులు రవీందర్‌రెడ్డి, పోతన్న యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మురళి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బేలలో ఆర్టీసీ స్థలం కబ్జా

- ఆర్టీసీ ఆర్ఎంకు వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బేల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగా ఉన్న లేఔట్ లోని 20 ఫీట్ల రోడ్డును ప్లాట్లు చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. ఈ విషయమై సోమవారం పట్టణంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో ఆర్ఎం జానిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బేల మండల కేంద్రంలో ఉన్న నాయకుల హస్తం ఉందని తెలుస్తోందని అన్నారు. ఈ అక్రమ దందాలో కోటి రూపాయల వరకు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ స్థలం 1.12 గుంటల వరకు స్థలం ఉంటుందని అన్నారు. స్థలం కాంపౌండ్ లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు సర్వే నంబర్ 42లో 20 ఫీట్ల రోడ్డును ప్లాట్లు చేశారని అన్నారు. 100 ఫీట్లు పొడవు 20 ఫీట్ల వెడల్పుతో ఆ రోడ్డును ఆర్టీసీ బస్టాండ్ స్థలంలోకి దారి తీశారని అన్నారు. దీనిపై దృష్టి సారించి ఆర్టీసీ స్థలాన్ని కబ్జా కాకుండా కాంపౌండ్ వాల్ కట్టాలని కోరారు. అయితే సానుకూలంగా స్పందించిన రీజినల్ మేనేజర్ జానిరెడ్డి వెంటనే స్థలాన్ని పరిశీలించి, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో ముత్యాల సురేష్, ఫైయిమ్, రాహుల్ ఉన్నారు.

పాడిపరిశ్రమపై రైతులు దృష్టి సారించాలి

నవతెలంగాణ-బేల



రైతులందరూ వ్యవసాయానికి అనుసంధానంగా పాడిపరిశ్రమపై దృష్టిసారించాలని, ప్రభుత్వం సైతం వారికి ఋణ సౌకర్యాలతో పాటు, డెయిరీలు ఏర్పాటు చేసి, పలు ప్రోత్సాహకాన్ని అందిస్తుందని విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ అన్నారు. మండలంలోని కొబ్బాయి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ సంచాలకుడు మధుసూదన్ మాట్లాడుతూ మండలంలో ఏర్పాటు చేసిన బీఎంసీ రోజుకు వెయ్యి లీటర్‌ల పాలను సేకరించడానికి తగు విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, ఇప్పటికే మండల కేంద్రానికి రెండు వందల పాల సేకరణ సేకరణ జరుగుతుందని, రైతులు పాడిపరిశ్రమ వైపు దృష్టిసారించి, పాడిపరిశ్రమను మరింతగా అభివృద్ధి చేయడానికి బ్యాంకుల ద్వారా రుణాలు కూడా అందజేస్తున్నామని అన్నారు. రైతులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ సంచాలకులు మధుసూదన్, కేజాజీ డెయిరీ డైరెక్టర్ మంగేష్ ఠాక్రె, నాయకులు ఠాక్రె గంభీర్, సతీష్ పవార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా పలు పోటీలను నిర్వహిస్తున్నామని అగ్నిమాపక శాఖ స్టేషన్ ఆఫీసర్ శివాజీ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం పట్టణంలో ఓ ప్రయివేట్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సహంగా పాల్గొని వారి ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి శివాజీ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేది వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి ఈనెల 20వ తేదిన అగ్నిమాపక శాఖ కార్యాలయంలో బహుమతులను అందిస్తామని పేర్కొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వార్డు నెం 33 భాగ్యనగర్ రాధాకృష్ణ మందిరం ప్రాంతంలో రెండో విడత ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అంధత్వ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో 42 వార్డుల్లో కట్టుదిట్టమైన ప్రణాళికతో ప్రజలందరినీ భాగస్వామ్యం చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఉచిత కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటిఅద్దాలు, మందులు అందిస్తుందని అన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది, సత్యనారాయణ, నర్సింలు, సాయన్న, రామన్, తిరుపతి, శ్రీనివాస్, మోహన్, మమత, జయ, సునీత, కాలనీవాసులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు కొత్త సర్వీసు బస్సు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నుండి హైదరాబాద్ (జేబీఎస్) వరకు కొత్తగా రాజధాని సర్వీస్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8:30కు, అలాగే జేబీఎస్ నుండి ఆదిలాబాద్‌కు సాయంత్రం 04:30కు కొత్తగా రాజధాని సర్వీస్‌ను వేసవి కాలాన్ని అనుకూలంగా ఈ నెల 11 నుండి రాజధాని ఏసీ బస్ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకొని ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గుంజాల, కొత్తపెల్లి సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాల గర్భిణీ మహిళలకు రిమ్స్ వైద్యులు డాక్టర్ విక్రమ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో 48 మంది గర్భిణీ మహిళలకు స్కానింగ్ నిర్వహించి తీసుకొనే జాగ్రతలపై వివరించారు. వారికి కావాల్సిన మందులను పంపిణీ చేశారు. వారి వెంట హెచ్ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, సీహెచ్ఓ హేమబిందు, వైద్య సిబ్బంది. నవనీత, శ్యామక, ఈశ్వరి, విద్యారాణీ, రాజేశ్వర్ ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 12న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పిట్ల రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-20 బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు సంబంధిత వయసు ధృవీకరణ పత్రంతో ఉదయం 8 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15, 16 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి 21వ ఫెడరేషన్ కప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 9492136510 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శాంతినగర్‌లో యూనాని వైద్యశిబిరం

నవతెలంగాణ-ఉట్నూర్



అయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ప్రభుత్వ యునాని వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని శాంతినగర్‌లోని వెల్‌నెస్ సెంటర్‌లో ఉచితంగా యూనాని వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనాని వైద్యులు సమీనా ఖానం, ప్రవీణ్ కుమార్ రోగులను యూనాని ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. యూనాని వైద్యంలో కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, చర్మ వ్యాదులు, ఆర్షమొలలు, నిద్రలేమి, దగ్గు, దమ్ము, జ్వరము వంటి తదితర వాటికి వైద్యం చేయడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటుగా పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. దోమల నుంచి కాపాడుకునేందుకు ఇంటిలో దోమ తెరలు వాడాలని సూచించారు. ప్రస్తుతం మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా అందరూ విధిగా మాస్కులను ధరించాలని అన్నారు. సామాజిక దూరం పాటించాలని, జ్వరం వచ్చిందని తెలిసిన వెంటనే పరీక్షలు చేయించుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం యూనానికి సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ వైద్య శిబిరంలో సిబ్బంది ఫార్మసిస్ట్ ఎండీ షకీర్, శివరామ్, కోటేశ్వర్, ఎఎన్ఎం శ్యామల, లక్ష్మి ప్రమీల, దుర్గమ్మ ఉన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 11 మార్చి 2023

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ కాంగ్రెస్ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ వ్యవహారం గురించి ఇప్పటి వరకు ఏ ఒక్క ఎమ్మెల్యే మాట మాట్లాడటం లేదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి పిలుపు మేరకు చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే బాల్క సుమన్ క్యాంప్ కార్యాలయ ముట్టడికి యత్నించగా పోలీసులు అరెస్ట్ చేసి చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పోలీసులు కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విచారణ వేగవంతం చేసి లీక్ చేసిన వారిని, సహకరించిన వారిని అరెస్ట్ చేయాలని, ఎంత పెద్ద రాజకీయ నాయకుడు ఉన్న విచారణ చేసి అరెస్ట్ చేయాలని అన్నారు. యువజన కాంగ్రెస్ చెన్నూర్ నియోజకవర్గం అధ్యక్షులు బుర్ర కృష్ణ, చెన్నూరి శ్రీధర్, జూల లక్ష్మణ్, ఆసంపెల్లి నరేష్, మహేష్, నాగరాజు, రాకేష్ ఆలూరి సంపత్ అరెస్ట్ అయ్యారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌పై మూడు రోజుల శిక్షణ

జన్నారం : స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ అరుణాని ఏపీఓ రవీందర్ ఆధ్వర్యంలో మండలంలోని దేవునిగూడా గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా టీం అధికారి రాజేందర్ మల్లేష్‌లు మండలంలోని 29 గ్రామపంచాయతీలా కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో దేవునిగుడా గ్రామంలో, ఇంటింటి సర్వే పూర్తి చేసుకుని గ్రామ సామాజిక చిత్ర పటాన్ని గీయడం జరిగింది. ఇందులో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, శిక్షకులు ఉత్సహంగా పాల్గొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని, మరుగు దొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నరు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ సరైన పద్ధతిలో జరగాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ టీం రాజేందర్, మల్లేష్ సూచించారు. రెడ్యూస్ ఆఫ్ ప్లాస్టిక్ లో భాగంగా సర్పంచ్ శిరీష గోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సరిత స్టీల్ బ్యాంక్‌ను గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ-తాండూర్

గ్రామ సంఘాల ఐక్యతకు, ఆర్థిక పటిష్టతకు కృషి చేస్తున్నగ్రామ సమైక్య అసిస్టెంట్లను పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని మండల కన్వీనర్ సరూప తెలిపారు. సోమవారం స్థానిక ఐబీలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్‌లను వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే కంటి వెలుగు వంటి అనేక పథకాల్లో తాము భాగస్వాములమవుతున్నామని తెలిపారు. ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా కేవలం రూ.3900 మాత్రమే వేతనం ఇస్తోందని తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నామని, ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదన్నారు. తమను సెర్ప్ ఉద్యోగులగా గుర్తించాలని, కనీస వేతన చట్టం ప్రకారం రూ.26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రంలో రవీందర్ గౌడ్, రంగు సురేష్, జనార్ధన్, దుర్గం కిరణ్, పుదారి తిరుపతిగౌడ్, నస్పూర్ రజిత, తాను భాయ్ పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏలు సోమవారం ధర్నా చేపట్టారు. తమకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థి, నిరుద్యోగ మహాదీక్షను జయప్రదం చేయండి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా మంగళవారం చేపట్టే విద్యార్థి, నిరుద్యోగ మహాదీక్ష జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నిధులు నియామకాలు ఉంటాయని ఆశిస్తే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విద్యార్థి, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రంలో యువత ఉపాధి అవకాశాల కోసం సంవత్సరాల తరబడి కోచింగ్ సెంటర్లలో వేలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకున్నారని టీఎస్‌పీఎస్సీ వైఫల్యంతో వివిధ రకాల పేపర్లు లీకై ఆయా పరీక్షలు రద్దయి నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. పేపర్ లీకేజీ చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సంఘటనపై సమగ్ర విచారణ జరిపి, క్వాలిఫై అయిన విద్యార్థులకు నెలకు రూ.20 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. నిరుద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే విద్యార్థి నిరుద్యోగ మహాదీక్ష విజయవంతం చేయాలన్నారు. దీనికోసం జిల్లా నుండి వేలాదిగా విద్యార్థులు, నిరుద్యోగులు కదిలి రావాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు దుర్గం రాజ్ కుమార్, గేడం టీకానంద్, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, చాపిడి పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఒకేఒక్క ఫిర్యాదు

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ఆర్యక్రమంలో ఒకే ఒక ఫిర్యాదు వచ్చింది. కిష్టంపేట గ్రామంలో వేసిన రోడ్డు లకి సంబంధించి పిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కష్ణ, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏఓ కవిత, ఐకేపీ ఏపీఎం ప్రమీల పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల పని వేళలు మార్చాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పనిచేస్తున్న సివిక్, సివిల్ కార్మికుల పనివెలలు మార్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు కోరారు. సోమవారం నిర్వహించిన సీసీసీ సివిక్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు అతిగా ఉండటం వల్ల కార్మికుల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని సివిక్, సివిల్ కార్మికుల పనివేళలను ఉదయం 6 నుండి 2 గంటల వరకు మార్పులు చేయాలని అన్నారు. అలాగే కార్మికులకు మజ్జిగ, చల్లటి త్రాగు నీటి వసతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, శంకర్, సదయ్య, అప్పారావు, లక్ష్మి పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్స్ పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని బుగ్గగూడెంలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా స్థానిక యువతకు దేవాపూర్ ఎస్సై విజయేందర్‌తో కలిసి సీఐ మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామీణ యువతకు అన్ని రంగాల్లో రాణించడానికి తమ వంతు సహకారాలు అందిస్తామన్నారు. సీసీ కెమెరాలు ప్రాముఖ్యతపై వివరించారు. సైబర్ క్రైం జరిగే విధానాలపై అవగాహన కల్పించారు.

పది పరీక్షా కేంద్రాలను పరిశీలించిన సీఐ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. కాసిపేట మోడల్ స్కూల్, మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల, దేవాపూర్ డీఏవీ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి భద్రత విషయాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐ వెంట కాసిపేట ఎస్సై గంగారాం ఉన్నారు.

అభివృద్ధి పేరిట అన్యాయం..!

- ఇండ్లు కోల్పోతున్న గుడిపేట్ గ్రామస్తులు • నాడు ఎల్లంపల్లి.. నేడు రహదారి విస్తరణ • న్యాయమైన పరిహారం కోసం పోరాటం



నవతెలంగాణ-హాజీపూర్

దేశ అభివృద్ధి కోసం రోడ్ల నిర్మాణం చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి.కానీ ఆ రోడ్ల నిర్మాణం కోసం ఎందరో త్యాగం చేయనిదే ఆ రోడ్లు నిర్మాణం జరగడం లేదు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో ఎన్ హెచ్ 63ను నాలుగు వరసల రహదారిగా ఏర్పాటు చేసే పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే మార్చి 28 న జాతీయ రహదారుల అభివద్ధి సంస్థ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ రోడ్డు నిర్మాణం జిల్లాలోని రాయపట్నం బ్రిడ్జ్ గూడెం నుండి క్యాతనపల్లి వరకు 36 కిలోమీటర్ల మేర భూ సేకరణ చేయడం కోసం ఎంత విస్తీర్ణం లో ఏ ఏ సర్వే నంబర్ లలో భూమి సేకరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ భూ సేకరణలో రోడ్డు పక్కన ఇండ్ల నిర్మాణం చేసుకున్న వారు కొందరు వారి ఇండ్లను పూర్తి గా కొల్పోనున్నరు. ఎన్ హెచ్ ఏ ఐ వారు ఇటీవల రోడ్డు నిర్మాణంపై ఒక మ్యాప్‌ను కూడా విడుదల చేశారు. ఇందులో ఒక్కో ప్రదేశంలో పూర్తి స్థాయిలో ఇల్లు కొల్పోనున్నట్ల తెలుస్తోంది. మిషన్ భగీరథ పైప్ లైన్ వున్న చోట రోడ్డును ఒకే వైపు మళ్లించారు. దీనితో గతంలో రోడ్డు పక్కన 75 ఫీట్ల దూరంలో ఇండ్లు నిర్మించుకున్న వారు కూడా పూర్తిగా ఇండ్లు కోల్పోవాల్సి వస్తుంది. ఒక్కో దగ్గర ఒక వైపే వంద ఫీట్ల వరకు భూసేకరణ చేయనున్నట్లు మ్యాప్‌లో పొందుపర్చారు. దీంతో ముందు జాగ్రత్తగా రోడ్డుకు అర్ అండ్ బీ. లెక్కల ప్రకారమే ఇల్లు నిర్మించుకున్న వారుకూడా నష్టపోవాల్సి వస్తుంది.

ఎల్లంపల్లి బాధితుల తీరని గోస

ఎల్లంపల్లి నిర్మాణం కోసం ప్రాజెక్ట్ నిర్మితమైన గుడిపేట్, నంనూర్ గ్రామస్థులు వారి పంట భూములను, ఇండ్లను త్యాగం చేశారు. అప్పుడు ప్రభుత్వం ఇచ్చిన అతికొద్ది పరిహారంతో కొందరు గుడిపేట్ జాతీయ రహదారికి అనుకొని భూములు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకొని ఉపాధి కోసం కిరాణా దుకాణాలు, చికెన్ సెంటర్ లు, గిర్నీలు ఇతరత్ర ఏర్పాట్లు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. అప్పుడు త్యాగం చేసి సర్వం కోల్పోయి ఐదారు ఎండ్లుగా కొద్దిగా నిలదొక్కుకున్న సమయంలో ఇప్పుడు జాతీయ రోడ్డు వెడల్పు పేరుతో కట్టుకున్న ఇండ్లను కొనుగోలు చేసిన భూములను తిరిగి కోల్పోవాల్సి వస్తుంది. రెండు సార్లు అభివృద్ధి కోసం త్యాగం చేయలేమని, రోడ్డు మ్యాప్‌ను మార్చాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

పోరాటానికి సిద్ధమవుతున్న బాధితులు

భూములను, ఇండ్లను ఇచ్చే ప్రసక్తే లేదని, దీని కోసం ఎంతటి పోరాటానికైన సిద్ధమవుతామని బాదితులు అంటున్నారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఇండ్లు, వ్యవసాయ భూములు త్యాగం చేసామని, అప్పుడు ఉపాధి కోల్పోయామని, రోడ్డు పక్కన విలువైన భూములను కొనుగోలు చేసి ఇండ్లు, దుకాణాలు, ఉపాధి పనులు చేసుకుంటుంటే ఇప్పుడు జాతీయరహదారి విస్తరణ పేరిట మా ఇండ్లు, భూములు తీసుకుంటాము అంటే ఒప్పుకోమని కరాఖండిగా చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైప్ లైన్ ఉన్నదని రోడ్డుకు ఒక్క వైపే భూసేకరణ చేయడంతో ఇండ్లు పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ప్రజాభిప్రాయ సేకరణ జరపనిదే ఎలా నోటిఫికేషన్ ఇస్తారని ఎన్‌హెచ్ ఏఐ అధికారుల తీరుపై మండి పాడుతున్నారు. కేంద్ర రహదారుల అభివద్ధి శాఖ మంత్రి నితిన్ గడ్కారిని కలిసేందుకు బాదితులు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

ఇప్పటికే సర్వం కోల్పోయాము


కందుల రమేష్. గుడిపేట్

ఎల్లంపల్లి నిర్మాణంలో మా వ్యవసాయ భూములు, ఇండ్లు కోల్పోయాము. ఉపాధి కరువైంది. జాతీయ రహదారి పక్కన ఇండ్లు నిర్మించుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నాము. ఇప్పుడు జాతీయ రహదారి వెడల్పు పేరుతో మళ్ళీ నా ఇంటిని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుంది. ఇప్పుడుకుడ నేను త్యాగం చేయడానికి సిద్ధంగా లేను. మాకు వేరే చోట ఇంటి నిర్మాణం కోసం స్థలం కేటాయించి, ఉపాధి చూపించాలి. మార్కెట్లో రూ.12 వేలకు చదరపు గజం వున్న ధరను చెల్లించాలి. ఇంటి నిర్మాణ కర్చు లెక్కేసీ మూడు రెట్లు నష్టపరిహారం చెల్లించాలి.

రోడ్డుకు రెండు వైపులా భూసేకరణ చేయాలి


బొడ్డు మల్లేష్. గుడిపేట్

జాతీయ రహదారి 63 విస్తరణలో భాగంగా అధికారులు పక్షపాతం గా ప్లాన్ రెడీ చేశారు.మిషన్ భగీరథ పైప్ లైన్ పేరుతో రోడ్డుకు ఒక వైపు మాత్రమే భూసేకరణ చేయడంతో చాలా మంది నష్టపోతున్నారు. రోడ్డుకు రెండు వైపులా సమానంగా భూ సేకరణ జరపాలి.రోడ్డుకు వంద ఫీట్లు వదిలేసి నిర్మించుకున్న నా ఇల్లు కూడా విస్తరణలో కోల్పోవాల్సి వస్తుంది.అధికారులు అందరికీ ఆమోదం గా వుండే విధంగా రోడ్డు విస్తరణ పనులు చేయాలి.రోడ్డుకు మధ్య నుండి 75 ఫీట్లు మాత్రమే రహదారుల సంస్థ ది.అధికారం వారి చేతుల్లో వుంది కదా అని ఇష్టారీతిన రోడ్డున వేస్తానంటే మేము ఊరుకోము .న్యాయం కోసం ఎంతటి పోరాటాని కైన సిద్ధమే.

తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం


జన్నారంలో..

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని పైడిపల్లి గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు మండల నాయకులు గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కానీ ఇప్పటివరకు చాలా గ్రామాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించడంలో కొంతమంది గ్రామ కమిటీ అధ్యక్షులు నిర్లక్ష్యం వాయిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తేవాలంటే ప్రతి కార్యకర్త శాయశక్తుల కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి ఆర్థికంగా అభివృద్ధి చేస్తుందన్నారు. పేదింటి ఆడపాచుల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, వృద్ధాప్య, వితంతు, బీడీ కార్మికులకు పిఛన్‌లు అందిస్తున్నామన్నారు. రైతుల కోసం రైతు బీమా రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టామన్నారు. ఈ సమ్మేళనంలో మండల పార్టీ అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్ మహిళా అధ్యక్షురాలు సుశీల అన్యకాంతామని పాల్గొన్నారు.


లక్షెట్టిపేట్‌లో..

సమ్మేళనానికి ఎంపీపీ జడ్పీటిసిలు డుమ్మా....

మండలంలో ఇప్పటికి రెండు ఆత్మీయ సమ్మేళనాలు జరిగినప్పటికీ స్థానిక ఎంపీపీ మాదాడి సరోజనా రవీందర్రావు, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్లు ఈ సమ్మేళనంలో పాల్గొనక పోవడంతో పార్టీ మారుతారేమోనని పలువురు చర్చింకుంటున్నారు. పార్టీ కోసం పనిచేయాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా సమ్మేళనానికి గైర్హాజరు కావటంపట్ల లపు అనుమానాలకు తావిస్తోంది.

లక్షెట్టిపేట్ : తెలంగాణ ఏర్పడక ముందు తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఎస్ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్తే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం తథ్యమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నడిపల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండలధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కెరమెరి : కార్యకర్తలకు ఎల్లా వేళలా అండగా ఉంటామని జడ్పీచైర్ పర్సన్ కోవ లక్ష్మీ, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి పర్యటన జిల్లాలో ఉంటుందని దీనిలో భాగంగా పోడు భూములకు పట్టాలు ఇచ్చే కార్యక్రమం జిల్లా నుంచి ప్రారంభం అయ్యేలా ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, ఎంపీపీ పెందూర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్‌కలాం పాల్గొన్నారు.


కెరమెరిలో..

14 నుంచి ఇంటింటా సీపీఐ కార్యక్రమం

నస్పూర్ : ఏప్రిల్ 14 నుండి మే 14 వరకు సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య తెలిపారు. సోమవారం నర్సయ్య భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు మేకలదాస్‌తో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'బీజేపీ హటావో దేశ్‌కు బచావో' అని నినాదంతో దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో, ప్రతి జిల్లాలో, ప్రతి గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి మోడీ విధానాలను వివరిస్తున్నామని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో ఓడించి వామపక్ష ప్రగతిశీల లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కూడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలను చైతన్యపరిచే విధంగా సీపీఐ కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మిర్యాల రాజేశ్వరరావు, శాఖపురపు కిరణ్ కుమార్, మండల నాయకులు అల్లా లచ్చిరెడ్డి, సందీప్ కుమార్, బొడ్డు లచ్చన్న, పోషం, ఎండి రషీద్, ప్రసాద్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 29 మంది లబ్దిదారులకు రూ.29,03,364 విలువ చేసే కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ కుమార్, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతితో కలిసి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపడుచులకు వరం లాంటిదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మేనమామ స్థానంలో ఉండి ప్రతి ఇంటి ఆడపడుచుకు రూ.1,00,116 అందించి ఆదుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సుక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదని వివరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల లింగాగౌడ్, సర్పంచులు కుబిడే మధూకర్, గాలి మధు, బెడ్డల రాజలింగు, కంప్యూటర్ ఆపరేటర్ ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా గుర్తింపు పొందిన అన్ని ఆసుపత్రులలో వైద్యం సేవలందించాలన్నారు. ప్రభుత్వ సలహా మండలిలో పెన్షనర్లకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. 2023 జులై 1న ఇచ్చే కొత్త పీఆర్సీని అమలు చేయాలన్నారు. 70 సంవత్సరాల అదనపు క్వాంటంను 65 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. కమ్యూటేషన్ 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాల తగ్గించాలని కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలో వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెల మొదటి రోజున పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు సదానందం, రమేష్, అబ్రహం, శివప్రసాద్, మూర్తి, మురళీధర్ రావు, లింగయ్య, మధుసూదన్, పద్మ, కనకమ్మ, సుభాష్, వరలక్ష్మి, రామస్వామి, శంకరయ్య, రామన్న పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని జన్నారం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీలో కంటి వెలుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు చిందం చంద్రయ్య, జాడి వెంకట్, లక్ష్మి, శ్రీనివాస్, డాక్టర్ జుబీర్, హెల్త్ సూపర్‌వైజర్, జె.పోసాని, హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, ఎన్.అపరంజి, జి.మాధవి, వరలక్ష్మీ రజిత, అంగన్వాడీ టీచర్లు జాడి సంజీవరాణి, గంజాయిల జమున, ఆశా కార్యకర్త రజిత పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు కంటి సమస్యలు లేకుండా చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేముల కృష్ణ, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, ఎంపీఓ నాగరాజు, వైద్యురాలు శ్రీదివ్య, నాయకులు చింతల భీమయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-హాజీపూర్

సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో పెద్ద ఎత్తున యువకులు, ఇతరా పార్టీల నాయకులు చేరుతున్నారని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సోమవారం హాజీపూర్ మండలం బుద్ధిపల్లి గ్రామానికి చెందిన 21మంది కాంగ్రెస్ నాయకులు సర్పంచ్ అన్నము మధుసూదన్‌రెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దివాకర సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి వారికి పార్టీ కండువా కప్పారు. గూడెం లిఫ్ట్ నుంచి సకాలంలో నీరు అందుతున్నాయన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఎల్లంపల్లి ప్రాజెక్టు, గూడెం లిఫ్ట్ మంజూరు అయిందని తెలిపారు. కొందరు నాయకులు వస్తారు పోతారనీ వారిని ఎవరూ నమ్మరని అన్నారు. నియోజకవర్గ ప్రజలే తన బలం, బలగమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి రవి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ పుస్కురీ శ్రీనివాస్ రావు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్ రావు, వైస్ చైర్మన్ ఒడ్డే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా అబిద్ హాసన్ సఫ్రాని జయంతి వేడుకలు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

జైహింద్ నినాదం సృష్టి కర్త జైనుద్ అబిద్ హసన్ సఫ్రాని జయంతి వేడుకలను తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం, టీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టీబీఎస్ఎస్ అధ్యక్షులు న్యాయవాది రాజలింగు మోతె ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలంలో జై హింద్ అనే పదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది నేతాజీ సుభాష్ చంద్రబోస్ కాగా, దీని సృష్టికర్త మాత్రం అబిద్ హసన్ సఫ్రానీ అని తెలిపారు. నేతాజీ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో అబిద్ హసన్ మేనేజర్‌గా పనిచేసే వాడని ఆర్మీలో భిన్న వర్గాలకు చెందిన వారిలో కొంతమంది నమస్కార్, మరి కొంతమంది రామ్ రామ్, అస్సలాము వలైకుమ్ రకరకాలుగా అభివాదం చేసుకునేవారని తెలిపారు. ఇలా రకాలుగా అభివాదాలు చేసుకోవడం నచ్చక తన సన్నిహితుడైన అబిద్ హసన్ సఫ్రానీ ప్రతిపాదించిన జైహింద్ అనే పదాన్ని ఆమోదించి, ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చాకిటి రమేష్, టీబీఎస్-ఎస్ అధ్యక్షుడు చీర్ల సత్యం, నాయకులు కల్లు జోయల్, వేల్పుల మహేందర్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-హాజీపూర్

వీదికుక్కల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గుడిపేట్ 13వ బెటాలియన్ ముందు నుండి బైక్‌పై వెళ్తున్న తిప్పని తిరుపతిని కుక్కలు వెంబడించాయి. మబైక్ అదుపుతప్పి కింద పడగా రెండు కుక్కలు తిరుపతిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా గుడిపేట్‌లో కుక్కలు వాహనదారులకు అడ్డురవడంతో జరిగిన ప్రమాదంలో గతంలో కొందరు మరణించారు.

వాహనాలకు బహిరంగ వేలం

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు ఏప్రిల్ 12న సాయుధ దళ కార్యాలయం నిర్మల్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జిల్లా ఎస్పీ సీహెచ్ ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని 41 వాహనాలు సాయుధ దళ కార్యాలయంలో ఉంచామని తెలిపారు. పట్టుబడిన వాహనాల కోసం 6 నెలల నుండి ఎవరు రానందున బహిరంగ వేలం వేస్తున్నామని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని ఎంటీ విభాగం 8519993462 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. స్వచ్ఛందంగా ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని, వేలంలో పాల్గొనేవారు గుర్తింపు కార్డులతో హాజరుకావాలని కోరారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మందమర్రి జీఎం

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియా సింగరేణి జీఎం మోహన్ రెడ్డి సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మందమర్రి ఏరియా కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్ ముంపు గ్రామమైన కాసిపేట మండలంలోని దుబ్బగూడెం గ్రామానికి సంబంధించి పునరావాసం విషయంపై కలెక్టర్‌కు వివరించారు. ఆర్అండ్ఆర్ బెన్ఫిట్స్, భూ సేకరణ గురించి చర్చించారు. ఈ మేరకు ఆర్అండ్ఆర్ జాబితాకు సంబంధించి పరిశీలించి తొందరగా పరిష్కారం చూపేందుకు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-బెజ్జూర్

14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని బౌద్ధ సమాజ్ సంఘాల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని బౌద్ధ సమాజ్ తాలుకా ఉపాధ్యక్షుడు దుర్గం దేవాజీ, మండలాధ్యక్షుడు కుమ్మరి పోషన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించాలని పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బుద్ధ విహార్ వద్ద నిర్వహించే జయంతి వేడుకలకు బౌద్ధ బాంధవులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అన్నదానం అభినందనీయం

నవతెలంగాణ - కౌటాల

అన్నదానం చేయడం అభినందనీయమని సీఐ సాదిక్‌పాషా అన్నారు. మండల కేంద్రంలో ప్రతి సోమవారం సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో కొన్ని వారాలుగా వారసంతలో ప్రజలకు అన్నదానం చేస్తుండగా సోమవారం సీఐ పాల్గొని భోజనం వడ్డించారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలి దప్పులతో అలమటిస్తున్న వారికి పట్టెడన్నాన్ని అందించడం అభినందనీయమన్నారు. సత్యసాయి ట్రస్టు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి జిల్లా అధ్యక్షుడు జనార్ధర్‌రావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

13న పశువుల సంత వేలం పాట

నవతెలంగాణ - సిర్పూర్(టి)

హుడ్కిళి గ్రామ పంచాయతీ పశువుల సంత వేలం పాట 13న నిర్వహించనున్నట్టు కార్యదర్శి దిలీప్ సర్కార్, సర్పంచ్ పిప్రె ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వేలంలో సరైన ధర రాకపోవడంతో మూడో పాట కోసం వేలం నిర్వహించనున్నట్టు తెలిపారు. వేలంలో ఆసక్తి కనబరిచే వారు రూ.50 వేల డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. వేలం దక్కించుకున్న వారు అదే రోజు పూర్తి డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

శివాలయంలో బెంగాళీల పూజలు

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం చింతలమానేపెల్లి మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన బెంగాళీ మహిళలు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుర్మాస చైత్రమాసంలో వచ్చే సోమవారాన్ని ప్రత్యేక రోజుగా భావించి కొన్ని సంవత్సరాలుగా మహిళలు రవీంద్రనగర్ నుండి పాదయాత్రగా వచ్చి శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేస్తున్నారు. దానికి ముందు ఆలయ ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య, సంతోష్ శివారాధన, అభిషేకం, దీపారాధన, హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

నవతెలంగాణ - బెజ్జూర్

పెంచికల్‌పేట్, బెజ్జూర్, దహెగాంలో జరుగుతున్న పదో తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాధికారి అశోక్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించి మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట మండల విద్యాధికారి రమేష్‌బాబు ఉన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణి అర్జీలను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కారించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. భూ సంబంధ సమస్యలు, ఫించన్, ఉపాధి కల్పన, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, తదితర సమస్యలపై అర్జీలను కలెక్టర్ స్వీకరించి, వాటి పరిష్కారానికి ఆయా శాఖాధికారులకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు శాఖల వారిగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వారంలోగా పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమ అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే ఏప్రిల్ 14న హైదరాబాద్‌లో డా.బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఆవిష్కరించనున్నా దృష్ట్యా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల నుండి 12 బస్సులను పంపడం జరుగుతుందని అన్నారు. ఉదయం 6గంటలకు బస్సు బయలు దేరుతుందని, అల్పాహారం, భోజనం, ఇతరత్రా ఏర్పాట్లు ఆయా సంబంధిత అధికారులకు బాధ్యతలను అప్పగించడం జరిగిందని అన్నారు. ఈ ప్రజావాణిలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ రమేష్ రాథోడ్, జడ్పీ సీఈఓ గణపతి, డీపీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శైలజ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో విడత కంటి వెలుగు ప్రారంభం



నవతెలంగాణ-భీమిని

రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం సోమవారం నుంచి కేస్లాపూర్ గ్రామపంచాయతీలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, లక్ష్మణ్ హాజరై ప్రారంభించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య పరీక్షలు, కండ్లద్దాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పోతురాజుల గంగక్క, వైస్ ఎంపీపీ చిలుముల మధు, బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్ గౌడ్, ముత్తినేని సురేష్, చంద్రకాంత్, పంచాయతీ కార్యదర్శి అజయ్ పాల్గొన్నారు.

'నేను బతికే ఉన్నాను'

- భవన నిర్మాణ కార్మికుని వింత పరిస్థితి
- బతికుండగానే డెత్ క్లెయిమ్
- కార్మికశాఖ కార్యాలయంలో వినతిపత్రం

నవతెలంగాణ-కాగజ్‌నగర్, బెజ్జూర్

ఒక కార్మికుడు బతికుండగానే చనిపోయినట్లుగా మరణ ధృవీకరణ పత్రాలు సమర్పించి డెత్ క్లెయిమ్ చేసుకున్న సంఘటన సిర్పూరు నియోజకవర్గంలో చోటు చేసుకుంది. కార్మిక బీమా రెన్యువల్ కోసం వెళ్లిన ఆ కార్మికునికి ఆన్‌లైన్‌లో తాను చనిపోయినట్లుగా చూపిస్తూ క్లెయిమ్ కూడా చేసుకున్నట్లుగా చూపించడంతో ఆ కార్మికుడు కంగు తిని తాను బతికే ఉన్నానని వినతిపత్రం అందించాడు. సిర్పూర్(టి) నియోజకవర్గంలోని బెజ్జూరు మండల కేంద్రానికి చెందిన కోట రాజన్న భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్నాడు. లేబర్ ఇన్సూరెన్స్ చేసుకున్నాడు. ఇన్సూరెన్ ఐడీ నెంబర్ 609117, దరఖాస్తు నెంబర్ ఎఎల్ఓఎస్‌పీకెజీఆర్/2018/00146 కాగా దీని రెన్యువల్ కోసం సోమవారం కాగజ్‌నగర్‌లోని ఈ సేవా కేంద్రానికి వెళ్లాడు. ఇతని ఐడీ నెంబర్‌తో రెన్యువల్ చేసేందుకు ఆన్‌లైన్‌లో చూడగా, ఈ కార్మికుడు మృతి చెందినట్లు, ఇప్పటికే డెత్ క్లెయిమ్ పొందినట్లుగా ఆన్‌లైన్‌లో చూపించడంతో కార్మికుడు విస్తుపోయాడు. దీంతో కాగజ్‌నగర్‌లోని సహాయ కార్మికశాఖ కార్యాలయానికి వెళ్లి తాను బతికే ఉన్నానని, నా పేరుతో సమర్పించిన మరణ ధృవీకరణ పత్రం, డిపెండెంట్ ధృవకరణ పత్రాలు నాకు ఇచ్చి, న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందించాడు. సాంకేతిక సమస్యనా లేక నిజంగానే ఆ కార్మికుడి పేరుతో డెత్ క్లెయిమ్ చేశారా అనే విషయంలో అధికారులు విచారణ జరుపుతున్నారు.



డెత్ క్లెయిమ్ అయినట్లుగా ఆన్‌లైన్‌లో చూపిస్తున్న దృశ్యం



కార్మికశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న కార్మికుడు

డా.బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డా. బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ కుల సంఘాల నాయకులతో అంబేద్కర్ జయంతి వేడుకల నిర్వహణపై అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాబా సాహెబ్ డా.బీఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ఈ నెల 13న సాయంత్రం 5గంటలకు స్థానిక అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ, అలాగే 14న జయంతి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై, కార్యక్రమ విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు సమన్వయము చేసుకోవాలని సూచించారు. ప్రజలకు తాగునీరు, భోజన వసతి, ఇతరత్రా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. డా.బీఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ముందుకు వచ్చిన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి సునీత కుమారి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుర్గం శేఖర్, నిర్వాహకులు మేకల మల్లన్న, మల్యాల స్వామి, శాలిక్‌రావు, ప్రజ్ఞకుమార్, సుదర్శన్, రామ్‌చందర్, భూమన్న, బాలశంకర్ కృష్ణ, మనోజ్, నక్క రాందాస్, సంతోష్, ప్రశాంత్ కుమార్, సిడాం రామ్‌కిషన్, ప్రసన్న కుమార్, నాగన్న, అరుణ్, శశికాంత్, రాజేశ్వర్, శేఖర్, అనిల్, బాబు, గంగారాం, మహేష్, నదీం పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఎంపీడీఓ, ఎంపీఈఓ, ఆర్టీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న హైదరాబాద్‌లో నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. దీనికి నియోజకవర్గం నుంచి 300 మంది చొప్పున జిల్లాలోని 2 నియోజకవర్గాల నుండి 600 మందిని తరలించేందుకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేలా జిల్లాస్థాయి అధికారిని నియమించి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అల్పాహారం, భోజన ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రతి బస్సులో ఒక ప్రభుత్వ ఉద్యోగి, ఒక పోలీసు అధికారి ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 13వ తేదీ రాత్రి వరకు ప్రతి మండల కేంద్రానికి బస్సు చేరుకోవాలని, 14న ఉదయమే బయలుదేరే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సురేందర్, డీపీఓ రమేష్, ఆర్టీసీ డీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనే యాదవుల ఆర్థికాభివృద్ధి



నవతెలంగాణ-భీమారం

కేసీఆర్ పాలనలోనే గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధి మెరుగుపడిందని తెలంగాణ రాష్ట్ర గొర్రె, మేకల వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం యాదవులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గొల్ల కురుమల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం మొదటి విడత పూర్తి చేసుకుని రెండో విడత చివరి దశలో ఉందని తెలిపారు. రెండో విడత లబ్దదారులు కుల ధృవీకరణ, బ్యాంక్ పాస్ బుక్, ఆధార్ కార్డు, డీడీలతో పాటు నామిని ఆధార్ కార్డులతో మండల పశువైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా ఇంకా డీడీలు చెల్లించని వారు వెంటనే చెల్లించి మండల పశువైద్య కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం వత్తిదారుల సంఘం మండల ఉపాధ్యక్షుడు రాపల్లి రాజన్న యాదవ్, రాపల్లి మల్లేష్ యాదవ్, వేల్పుల రాజేష్, కాల్వ మల్లేష్ యాదవ్, కోలా కిష్టయ్య యాదవ్, తమ్మినవేని శ్రీనివాస్ యాదవ్, వేల్పుల ఓదెలు, బర్ల రాజన్న యాదవ్, మారం మల్లేష్ యాదవ్, వేల్పుల గట్టయ్య, పోచన్న, తువ్వ పోశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ బహిరంగ సభకు ఖర్గే రాక

నవతెలంగాణ-నస్పూర్



నియోజకవర్గంలోని నస్పూర్ మున్సిపాలిటీలో 14న జరిగే భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ వెల్లడించారు. సోమవారం నస్పూర్‌లో నిర్వహించే సభా మైదానాన్ని వారు పరిశీలించారు. పలు కారణాలతో వాయిదా పడుతూ వస్తున్న సభ 14న ఖరారు అయినట్లు తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఖర్గే తెలంగాణలో తొలిసారి మంచిర్యాలలో ఏర్పాటు చేస్తున్న సభకు హాజరవుతున్నట్లు తెలిపారు. అంబేద్కర్ జయంతి రోజున సభను ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. సభ సాయంత్రం ప్రారంభమవుతుందని తెలిపారు. సభకు రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, జైరాం రమేష్, కొప్పుల రాజు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జాతీయ, రాష్ట్రీయ ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు.

ప్రశాంతంగా ఆశ్రమ ఆదర్శ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సైన్స్ ఒలంపియాడ్ ఆశ్రమ ఆదర్శ పాఠశాలలో 4వ తరగతి నుండి ఏడో తరగతి వరకు ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు ఏసీఎంఓ ఉద్ధవ్ తెలిపారు. జిల్లాలో మొత్తం 49 పరీక్ష కేంద్రాల్లో 1,588 విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. 4వ తరగతి పరీక్షలకు 373మంది, 5వ తరగతికి 493మంది, 6వ తరగతికి 353మంది, 7వ తరగతి కోసం 369మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఒక్క తరగతికి 40 మంది చొప్పున ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

సీఐని కలిసిన మండల నాయకులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

సోన్ పరిధిలో నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సీఐ నవీన్ కుమార్‌ని సోమవారం బీఆర్ఎస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ ఎంపీపీ కేశం రమేష్, అర్జున్‌రెడ్డి, బుర్రి భూమేష్, కల్లెడ భూమన్న నాయకులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు అరికట్టాలి

నవతెలంగాణ-నిర్మల్



మాతృ మరణాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో మాతృ మరణాలపై ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గర్భవతులకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందించి, జిల్లాలో మాతృ మరణాలను అరికట్టాలని అన్నారు. గర్భవతిగా ఉన్నప్పటి నుంచే క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి, అధిక ప్రమాదంగల కేసులను గుర్తించి, అవసరమైన సేవలను అందించాలని తెలిపారు. ముఖ్యంగా రక్తహీనత వల్ల గర్భవతులలో అనేక సమస్యలు వచ్చి మరణాలకు దారితీస్తున్నాయని అన్నారు. ప్రతి గర్భవతిని రక్తహీనత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ధన్‌రాజ్, వైద్యారోగ్యశాఖ అధికారులు ఇద్రీస్ గౌరీ, రాజేందర్, కార్యక్రమం నిర్వహణ అధికారులు డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ నైనారెడ్డి, డాక్టర్ నిఖిల పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రానికి చెందిన రైతు పుష్ప మైస్కర్ మూడున్నర ఎకరాల్లో పండించిన మొక్కజొన్న పంట షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం సాయంత్రం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఒకే దగ్గర ఉండడంతో షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు ఎగిసిపడి మంటలు చెలరేగి మొక్కజొన్న పంటకు అంటుకున్నాయి. దీంతో పంట పూర్తిగా కాలి బూడిదైంది. రూ.4.50లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు బోరుమన్నాడు. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

ఘనంగా దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నార్నూర్

ప్రజా సేవలో ముందుంటూ ఎవరికి ఏ ఆపద వచ్చిన బేధభావం లేకుండా ఆప్యాయతంగా పలికే దివ్య శ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పుట్టిన రోజు సందర్భంగా గాదిగూడ మండలంలోని లోకారి గ్రామంలో ఫౌండేషన్ సభ్యులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దివ్యశ్రీ ఫౌండేషన్ సభ్యులు పూసం సురేష్, మెస్రం చిన్ను, మెస్రం జైతు, సలాం మధు, మడావి భారత్ ఉన్నారు.

ముగిసిన వాసవీ మాతా పూజలు

నవతెలంగాణ - బెజ్జూర్

మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాసవి మాతా పూజలు సోమవారం ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు తంగడపల్లి నీలేష్ ఇంటిలో వాసవి మాతను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో జిల్లా విద్యాధికారి డాక్టర్ అశోక్‌కుమార్, మండల విద్యాధికారి రమేష్‌బాబు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్, నేరెళ్ల సంతోష్, శ్రీనివాస్, పుల్లూరి సతీష్, కె శెట్టిసాగర్, రాచకొండ మహేందర్, నగేష్, వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

30లోగా మన ఊరు మన బడి పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-బెజ్జూర్

మన ఊరు మన బడి కింద ఎంపికైన పాఠశాలల పనులు ఈ నెల 30లోగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో పెంచికల్‌పేట్, బెజ్జూర్ మన ఊరు మన బడి పనులపై రైతువేదికలో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మండలంలో 17 పాఠశాలల్లో, పెంచికల్‌పేట్ మండలంలో 10 పాఠశాలల్లో మన ఊరు మన బడి పనులు కొనసాగుతున్నట్టు తెలిపారు. పనులను వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. త్వరగా పనులు చేపట్టాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, విద్యా కమిటీ చైర్మన్‌లను ఆదేశించారు. సమావేశంలో ఎంఈఓ రమేష్‌బాబు, సర్పంచ్‌లు భుజాడి శేఖర్, కతెల అంజతి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, ఎస్ఈసీఆర్‌పీ భిక్షమయ్య పాల్గొన్నారు.

డీటీడీఓను వెంటనే సరెండర్ చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి డీటీడీఓను సరెండర్ చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిశెల కార్తీక్‌లు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో గల విద్యార్థులకు 2022-23 విద్యాసంవత్సరానికి పంపిణీ చేయాల్సిన ప్లేట్‌లు, గ్లాసులు నేటికీ పంపిణీ చేయకున్న చేసినట్లు రూ.11లక్షల 59వేలు డీటీడీఓ విత్‌డ్రా చేయడం జరిగిందని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి డీటీడీఓను వెంటనే సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు.

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ



కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పొన్న గ్రామ సర్పంచ్ కానిందే చంద్రకళ అన్నారు. సోమవారం మండలంలోని పొన్న గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి సమస్యలతో ఏ ఒక్కరూ బాధపడకుడనే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అతుల్ కుమార్, వైద్యులు బి నరేష్, పూజ, ఎఎన్ఎం అహల్య, సంగీత పాల్గొన్నారు.